క్లుప్తంగా

రూ.3లక్షల నిధుల ప్రొసీడింగ్ అందజేత



ప్రొసీడింగ్ అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటేశ్

తలకొండపల్లి: తండాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని పూల్‌సింగ్ తండా గ్రామ పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.3లక్షల నిధులు మంజూరు అయినట్లు జెడ్పీటీసీ చెప్పారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రూ.3 లక్షల ప్రొసీడింగ్ కాపీని తండావాసులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, రాజు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, హనుమాన్ టెంపుల్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, సాయి, శంకర్, గోపాల్, వినోదు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి పంచాయతీ సిబ్బంది సమ్మెబాట

- ఎంపీడీఓకు నోటీసు అందజేత

ఇబ్రహీంపట్నం: ఈనెల 25 నుంచి గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మెబాట పట్టనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ క్రాంతికిరణ్‌కు సమ్మె నోటీసును జేఏసీ నేతలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ జేఏసీ మండల అధ్యక్షులు బాలప్ప, కార్యదర్శి దేవదాసు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న వర్కర్స్, కారోబార్స్, బిల్ కలెక్టర్స్, స్వీపర్స్, ఎలక్ట్రీషియన్స్, వాటర్‌మెన్, డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెబాట పట్టనున్నట్లు చెప్పారు. పంచాయితీల్లో పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, పీఆర్సీ నిర్ణయించిన మినిమమ్ బేసిక్ వేతనం చెల్లించాలన్నారు. జీఓ నంబర్ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, బిల్ కలెక్టర్లకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న జనాభా ప్రతిపాదికన పంచాయితీల్లో కార్మికుల సంఖ్య పెంచాలని.. ప్రత్యేక గ్రాంటు కేటాయించి వేతనాలు ఇవ్వాలని, ప్రతినెల జీతాలు చెల్లించాలని తదితర డిమాండ్‌లతో సమ్మెకు వెళ్తున్నట్లు చెప్పారు. యాదయ్య, నరేష్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ సీఐ లింగయ్య

యాచారం: సాగర్ రోడ్డుపై ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తే బాధ్యులైన వాహనాదారులపై కేసులు నమోదు చేస్తామని యాచారం సీఐ లింగయ్య హెచ్చరించారు. సాగర్‌రోడ్డులోని మాల్, యాచారం కేంద్రాల్లో శుక్రవారం సీఐ పర్యటించారు. రోడ్డును అక్రమించి పార్కింగ్ చేస్తున్న వాహనాదారులను హెచ్చరించారు. కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని అన్నారు. అనంతరం మాల్‌లోని చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలను పరిశీలించారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.



ఇబ్రహీంపట్నం రూరల్: ఎస్‌హెచ్‌జీలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



ఆమనగల్లు: మున్సిపల్ చైర్మన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

మున్సిపాలిటీలకు మహర్దశ

- అట్టహాసంగా పట్టణ ప్రగతి దినోత్సవం
- అభివృద్ధిలో రాష్ట్రం దూసుకుపోతోందని నేతల హర్షం

ఇబ్రహీంపట్నం రూరల్: గచ్చిబౌలి, హైటెక్ సిటీలను తలదన్నేలా ఆదిబట్ల మున్సిపాలిటీని అభివృద్ధి చేసి చూపిస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొంగరకలాన్ సమీపంలోని కల్వకోలు లక్ష్మీదేవమ్మ ఫంక్షన్ హాల్‌లో పట్టణ ప్రగతి దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. గతంలో నియోజకవర్గంలో ఒకేసారి నాలుగు కొత్త మున్సిపాలిటీలను ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తుచేశారు. వాటిలో ఆదిబట్ల మున్సిపాలిటీ చిన్న మున్సిపాలిటీ అయినప్పటికీ అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రూ.3 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు రూ.26 లక్షల చెక్కు అందజేశారు. శానిటేషన్ సిబ్బందికి పీపీఈ కిట్లు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రశంశాపత్రంతో పాటు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటచారి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళమ్మ, కౌన్సిలర్లు మౌనిక, సంధ్య, కోఆప్షన్ సభ్యులు రేణుక, రసూల్‌ఖాన్, షాబేరా బేగం, మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు జంగయ్య, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో మున్సిపల్ వాహనాలు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించిన పట్టణ ప్రగతి దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య పట్టణానికి చెందిన వివిధ మహిళా సంఘాలకు రూ.2 కోట్ల 32 లక్షల రుణాలు పంపిణీ చేశారు. ఉత్తమ విధులు నిర్వహించిన పారిశుధ్య కార్మికులు, సిబ్బందని సన్మానించారు. వారి సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, విక్రంరెడ్డి, కృష్ణయాదవ్, వెంకటమ్మ, సుజాత, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, తహసీల్దార్ జ్యోతి, ఎస్ఐ సుందరయ్య పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో..

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలోని పురపాలక సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి చందు అన్నారు. తెలంగాణ అవతరణ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి దినోత్సవాన్ని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంపై జాతీయ జెండాను ఎగురవేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగులను, కార్మికులను సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. మహిళా సంఘాలకు రూ.80 లక్షల రుణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, కమిషనర్ యూసుఫ్, తహసీల్దార్ రామ్మోహన్, సీడీపీఓ శాంతిశ్రీ, కౌన్సిలర్లు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేటలో..

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను చైర్‌పర్సన్ ఎగురవేశారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రంగోళీ కార్యక్రమాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పాలకవర్గ సభ్యులను, సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణ, కమిషనర్ సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: మహిళా ఉద్యోగినిని సన్మానించిన చైర్‌పర్సన్ స్రవంతి

వేగంగా చిన్నపట్టణాల అభివృద్ధి..

హయత్‌నగర్: స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో చిన్న పట్టణాల అభివృద్ధి వేగంగా జరుగుతందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని ఎస్‌పీఆర్ శ్రీరస్తూ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో మంచినీటి కోసం రూ.94 కోట్లు ఖర్చు చేశామని.. పలు అభివృద్ధి పనుల కోసం మరో రూ.45 కోట్లు వెచ్చించామన్నారు. చైర్‌పర్సన్, కాంగ్రెస్ కౌన్సిలర్లు అభివృద్ధి నిరోధకులుగా మారారని ఆరోపించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. కాగా పట్టణ ప్రగతి ఆహ్వాన పత్రంలో తనపేరు లేదనే కారణంగా చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనూరాధతో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరైనట్లు సమాచారం.

నేడు 'గిరిజనోత్సవం'

మంచాల: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల పరిధిలోని పటేల్ చెరువు తండాలో గిరిజనోత్సవం నిర్వహిస్తామని ఎంపీడీఓ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం కూడా ప్రారంభిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఆర్డీఓ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు సకాలంలో హాజరు కాగలరని కోరారు.

స్వయం ఉపాధిపై దృష్టి సారించండి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: యువత స్వయం ఉపాధితో ఎదగాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మక్తమాధారం గ్రామానికి చెందిన సోమరాజు భిక్షపతి స్వయం కృషితో ఏర్పాటు చేసిన డ్రైక్లీనింగ్ షాప్‌ను జెడ్పీటీసీ ప్రారంభించారు. యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలన్నారు. యువతకు బ్యాంకులు రుణాలు అందించి ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు మోత్యానాయక్, చంద్రమౌళి, సాయిలు, ఉపసర్పంచ్ గణేశ్ పాల్గొన్నారు.

20 మందికి కంటి ఆపరేషన్లు

ఆమనగల్లు: మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి చెందిన 20 మందికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో గతంలో ఇర్విన్ గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా శిబిరంలో 20మంది వృద్ధులకు కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు చెప్పారు. ఈ మేరకు కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసిన 20 మందిని శుక్రవారం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీశైలం, శ్రీను, వెంకట్‌నారాయణ ఉన్నారు.

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్

- జైపాల్‌యాదవ్‌పై బీజేపీ నేత ఆచారి మండిపాటు
- రోడ్డు నిర్మాణంలో జాప్యాన్ని నిరసిస్తూ పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న ఆచారి, బీజేపీ నాయకులు

తలకొండపల్లి: ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తన పదవికి రాజీనామా చేస్తే తక్షణమే వెంకటాపూర్ క్రాస్ రోడ్డు నుంచి పడకల్ గ్రామ పంచాయతీ వరకు బీటీ రోడ్డు వేయించి చూపిస్తామని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ సీనియర్ నేత తల్లోజు ఆచారి స్పష్టం చేశారు. మండల పరిధిలోని వెంకటాపూర్ తండా క్రాస్ రోడ్డు నుంచి పడకల్ పంచాయతీ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆచారి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. ఇదే డిమాండ్‌తో గత మూడు రోజులుగా దేవునిపడకల్‌లో బీజేపీ నేతలు నిరసన దీక్షలు చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని ఆచారి సందర్శించి వారికి నిమ్మరసం తాపించి దీక్షలు విరమింపజేశారు. అనంతరం ఆచారి మాట్లాడుతూ.. దేవుని పడకల్‌లో మమత్‌ఖాన్ చెరువు తెగిపోయి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు మాత్రం కట్ట మరమ్మతులకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డాడు. అదేవిధంగా చీపునుంతల అమ్రాయి చెరువు మరమ్మతుల విషయంలో అధికారులు జాప్యం చేస్తున్నారని.. త్వరితగతిన పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ జెడ్పీటీసీ హరిప్రసాద్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ కుమార్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్, ఉపసర్పంచ్ అనిల్, బీజేపీ మండలాధ్యక్షుడు రవిగౌడ్, జిల్లా కార్యదర్శి పాండుప్రసాద్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారు

జెడ్పీటీసీ దాసుగౌడ్

హయత్‌నగర్: బీఆర్ఎస్ సర్కార్ స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తోందని అబ్దుల్లాపూర్‌మెట్టు మండల జెడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్ ధ్వజమెత్తారు. జెడ్పీటీసీగా బాధ్యతలు చేపట్టి 4 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు... రాష్ట్రంలో గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు ఎలాంటి నిధులు ఇవ్వకపోవడంతో పాటు వారికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో వారు కేవలం తోలుబొమ్మలుగా మారారని మండిపడ్డారు. గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వకపోవడంతో సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

ప్రజాసంఘాల పోరాట వేదిక

అబ్దుల్లాపూర్‌మెట్: ఉపాధి కూలీలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రజాసంఘాల పోరాట వేదిక నాయకులు డిమాండ్ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లోని ఉపాధి కూలీలను శుక్రవారం వారు కలిసి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధి పనులకు సంబంధించి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి బిల్లు రాలేదని.. వారానికి ఒకసారి రావాల్సిన బిల్లు రెండు నెలల నుంచి రాకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు నర్సింహ, వెంకన్న, కూలీలు ఉన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కృష్ణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలు ఇస్తామన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు తక్షణమే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, సోషల్‌మీడియా నియోజకవర్గ కన్వీనర్ అజీం, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రాములు, వెంకటయ్య, కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు విష్ణు, నాయకులు.. డేవిడ్, చెన్నకేశవులు, రాజు, సుదర్శన్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు భూమిపూజ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని మల్‌శెట్టిగూడ గ్రామంలో శుక్రవారం శ్రీ కంఠక మహేశ్వర ఆలయ భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్ ఈ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, నాయకులు.. రాంచంద్రయ్య, యాదయ్య, భిక్షపతిగౌడ్, అశోక్ పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయ నిర్మాణానికి..

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో మైసమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ సులోచన శుక్రవారం భూమిపూజ చేశారు. ఆలయాల నిర్మాణంతో భక్తిభావం పెంపొందుతుందని.. ఆలయ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహగౌడ్, ఉపసర్పంచ్ గణేశ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు యాదగిరి, కవిత, మహేందర్‌గౌడ్, జెనిల్ కుమార్, బాల్‌రాజ్, చెన్నయ్య, చందు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: శంకుస్థాపన చేస్తున్న క్యామ

ఒంటిపూట బడులను పొడిగించండి: పీఆర్‌టీయూ

ఇబ్రహీంపట్నం రూరల్: ఎండలు మండిపోతున్న తరుణంలో ప్రభుత్వ పాఠశాలలకు మరో వారం రోజుల పాటు ఒంటిపూట బడులు పొడిగించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు వర్కాల పరమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జూన్ నెల సగం అయిపోయినప్పటికీ ఇంకా ఎండలు తీవ్రంగా ఉన్నాయని.. విద్యార్థులు ఎండలకు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి మరో వారం పాటు ఒంటిపూట బడులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఎండనుంచి సంరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

సీఐ కాశీవిశ్వనాథ్‌కు సన్మానం



సీఐని సన్మానించిన నాయకులు

మంచాల: మంచాల నూతన సీఐగా బాధ్యతలు తీసుకున్న కాశీవిశ్వనాథ్‌ను ఎంపీపీ నర్మద, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ శుక్రవారం మంచాల పీఎస్‌లో ఘనంగా సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బహదూర్, నాయకులు రవి, కిషన్‌రెడ్డి, శ్రీశైలం, శేఖర్, జంగారెడ్డి, బద్రీనాథ్ గుప్తా, మహేందర్, విజయ్, సాయి, శంకర్, ప్రవీణ్ , పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన సిద్దిగారి కృష్ణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద కోలుకుంటున్నాడు. బాధితుడిని శుక్రవారం ఉదయం డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.4 వేలు ఆర్థికసాయం అందించారు. అదే విధంగా అనారోగ్యంతో బాధపడుతున్న కాకర్ల సుగుణమ్మను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3 వేలు ఆర్థికసాయం అందించారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, వార్డుసభ్యులు మల్లయ్య, శ్రీను, లక్ష్మయ్య, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్, నాయకులు ఉన్నారు.

తలకొండపల్లి మండలంలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని లింగరావుపల్లికి చెందిన అంజయ్య (52) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, వార్డుసభ్యుడు భాస్కర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జెడ్పీటీసీ రూ.3000, పీఏసీఎస్ చైర్మన్ రూ.2000, భాస్కర్ రెడ్డి రూ.2000 బాధిత కుటుంబానికి ఆర్థికసహాయం అందజేశారు. అలాగే గట్టుఇప్పలపల్లికి చెందిన మరియమ్మ చనిపోవడంతో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.2500 ఆర్థిక సహాయం అందజేశారు.

పాఠశాలలకు రక్షణేది?

- మండలంలోని మెజార్టీ స్కూళ్లకు ప్రహరీలు కరువు
- పందులు, మూగజీవాల సంచారంతో కంపుకొడుతున్న పరిసరాలు
- రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పందుల సంచారం

కడ్తాల్: మండల పరిధిలోని మెజార్టీ పాఠశాలలకు ప్రహరీలు లేవు. ప్రధానంగా మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పాఠశాలకు రక్షణ కరువైంది. ప్రహరీ లేకపోవడంతో పాఠశాల మూగజీవాలకు నిలయంగా మారింది. చీకటిపడితే మందుబాబులకు అడ్డాగా మారింది. దీనికి తోడు పాఠశాలలకు నైట్‌వాచ్‌మెన్‌ల నియామకం చేపట్టకపోవడంతో రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. కొందరు పాఠశాలలోని వస్తువులను ఎత్తుకెళ్తూ చోరీలకు పాల్పడుతున్నారు. రాత్రివేళలో మద్యం సేవించడంతో పాటు ఖాళీ సీసాలను వదిలేయడం వంటివి చేస్తున్నారు. ఉదయాన్నే పాఠశాలకు వచ్చిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో మద్యంసీసాలు, వ్యర్థపదార్థలు ఉండటంతో ఆటలు ఆడేప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదంటూ వాపోతున్నారు.

కొన్నింటికి మాత్రమే ప్రహరీలు..

మండల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, డీఎన్‌టీ, ఆశ్రమ పాఠశాలలున్నాయి. వీటిలో కొన్నింటికి మాత్రమే ప్రహరీల నిర్మాణం చేపట్టారు. మిగతా పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణం చేపట్టలేదు. కనీసం అటెండర్లు కూడా లేరు. ప్రత్యేకించి 400కు పైగా విద్యార్థులు గల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేక వస్తువులకు రక్షణ కరువైంది. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన పాఠశాలలో కంప్యూటర్‌లు, ఇతర విలువైన సామగ్రి సమకూర్చినా రాత్రివేళల్లో వాటికి రక్షణ లేకుండా పోయింది. మండలంలోని రేఖ్యతండా, గడ్డమీదితండా, పోచమ్మగడ్డ, కానుగుబావి, పల్లెచెలక, మద్దెలకుంట, రావిచేడ్ ప్రాథమిక పాఠశాల, పుల్లేరుబోడ్, చెన్నారంతండా, గుర్లకుంటతండాతో పాటు పలు పాఠశాలలకు నేటికీ ప్రహరీలు లేవు. దీంతో ఆయా పాఠశాలల ఆవరణలో మూగజీవాలు సంచరిస్తున్నాయి. ప్రభుత్వం మనఊరు–మనబడి కింద పాఠశాలల్లో టాయిలెట్లు, విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా, ఫర్నీచర్ ఏర్పాటు, మరమ్మతులు, శిథిలమైన గదుల స్థానంలో నూతన గదుల నిర్మాణం, కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ప్రహరీల నిర్మాణం చేపడుతోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్, ప్రహరీల నిర్మాణం చేపట్టి రక్షణ కల్పించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

పందులు సంచరిస్తున్నాయి



మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలతో పాటు మండల పరిధిలోని అనేక పాఠశాలలకు ప్రహరీలు లేక పందులు, కుక్కలు సంచరిస్తూ విద్యార్థులకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దీంతో పాఠశాలల పరిసరాలు దుర్గంధభరితమవుతున్నాయి. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే ప్రహరీల నిర్మాణం చేపట్టాలి.

– షాబుద్దీన్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు, కడ్తాల్

అధికారుల దృష్టికి తీసుకెళ్తా



మండల కేంద్రలోని బాలుర ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేని విషయం అధికారుల దృష్టికి తీసుకుపోయా. ప్రహరీకి సంబంధించిన స్థలంపై కోర్టులో కేసు ఉంది. ఈ కారణంగా ప్రహరీ నిర్మాణాలు చేపట్టడం లేదు. ప్రహరీ నిర్మాణ అవశ్యకతను ఉన్నతాధికారులకు మరోసారి వివరిస్తాను. కేసు కొలిక్కి రాగానే ప్రహరీ నిర్మాణం చేపడతాం.

– జంగయ్య, హెచ్ఎం, బాలుర ఉన్నత పాఠశాల, కడ్తాల్